15-4-99



# విజన్ 'చూపు'లో వివక్ష



బాలగోపాల్

ప్రాంతీయ అసమానతలు తీవ్రస్థాయిలో ఉన్నాయని రాజ్యాంగమే గుర్తించిన మూడు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. (మిగిలిన రెండు మహారాష్ట్ర, గుజరాత్). అ అసమానతలను కొంత మేరకయినా తగ్గించడానికి ఆర్టికల్ 371–డి లో పార్లమెంటు కొన్ని ఆదేశాలను చేర్చింది. అవి ప్రధానంగా విద్యా ఉద్యోగ అవకాశాలలో మూడు ప్రాంతాల మధ్యఉన్న అసమానతలను తొలగించడానికి– ఇంకా సరిగ్గా చెప్పాలంటే కోస్తా జిల్లాలవాళ్ళే విద్య, ఉద్యోగరంగాలను పూర్తిగా ఆక్రమించుకోకుండా చూడడానికి– ఉద్దేశించిన ఆదేశాలు.

అవి సక్రమంగా అమలు కావడం లేదన్నది ఒక విషయం కాగా, ప్రాంతీయ అసమానతలు, వివక్ష, కేవలం విద్యా ఉద్యోగ రంగాలకే పరిమితం కాలేదన్నది మరింత ముఖ్యమైన విషయం. ఆర్టికల్ 371–డి స్ఫూర్తిని కాపాడుకోవడం ఎంత ముఖ్యమో అందులో ప్రస్తావనకు నోచుకోని ఇతర రూపాల వివక్షతను ఎదుర్కొనే పాలనా విధానాలను సాధించుకోవడం అంతే ముఖ్యం. భాషా సంస్కృతుల నుండి సాగునీటి వరకు అన్ని రంగాలలోనూ వివక్ష, చిన్నచూపు, అసమాన ప్రతిపత్తి కనిపిస్తాయి.

మరొక 20 సంవత్సరాల లోగా మనకు స్వర్ణాంధ్రప్రదేశ్ అందిచ్చే వ్యూహం రచించానని చెబుతున్న ముఖ్యమంత్రి ఈ వివక్షనూ అసమానతలనూ అంతంచేయడానికి ఆ వ్యూహంలో ఏ చెప్పారో తెలుసుకోవాలన్న కుతూహలం ఉండడం సహజం. స్వర్ణాంధ్రప్రదేశ్‌లో అన్ని రకాల అసమానతలూ పోతాయని 'విజన్–2020' పదేపదే అంటుంది కాబట్టి ప్రాంతీయ అసమానతలు పోగొట్టడానికి అందులో ఏ ఆలోచనలు పొందు పరచబడ్డాయో చూడాలనుకోవడం సహజం.

తెలంగాణా, రాయలసీమ ప్రాంతాల ఉద్యమాకాంక్షలు సాగునీటికి చాలా ప్రాముఖ్యం ఇచ్చాయి. సాగునీటితో అన్ని సమస్యలూ పోవుగానీ తీవ్ర దారిద్ర్యాన్ని తగ్గించవచ్చు. సాగునీటి ప్రాతిపదికన జరిగే అభివృద్ధికి కొంత విస్తృత ప్రాతిపదిక ఉంటుంది. కొద్దిమందికి ఎక్కువ ప్రయోజనం కల్పించడమే కాక ఎక్కువమందికి కొంత ప్రయోజనం కూడా కల్పిస్తుంది. ఎక్కువమంది చేతిలో కొంత మిగులు ఉంటుంది. దానితో ఆ వర్గాలలోని మలితరం కొంతయినా చదువుకొని సాంకేతికంగా పురోగమించిన జీవిత రంగాలలోకి ప్రవేశించగలదు. లేదా అది వర్తక, పారిశ్రామిక పెట్టుబడిగా మారగలదు.

కోస్తా ఆంధ్ర జిల్లాల చరిత్ర ఈ వాస్తవాన్ని కళ్ళకు కట్టినట్టు చూపిస్తుంది. అయితే సాగునీరంటే నదీజలాలే కానవసరంలేదు. చెరువులు, బావులు కూడా సాగునీటి సాధనాలే. చెరువుల నిర్మాణానికీ, మరమ్మతుకూ, నిర్వహణకూ హేతుబద్ధమైన విధానం ప్రభుత్వం దగ్గర ఉండాలి. ఇప్పటిదాకా అటువంటిది ఏమీలేకపోవడం తెలంగాణా రాయలసీమలకు చాలా నష్టం కలిగించింది. ఎప్పుడో కాకతీయులూ కుతుబ్ షాహీలూ విజయనగర రాజులూ ఆసఫ్ జాహీలూ తవ్వించిన చెరువులే తప్ప కొత్తవేవీ లేకపోగా ఆ చెరువుల నిర్వహణ సహితం తీవ్రంగా నిర్లక్ష్యం చేయబడిన విషయాలలో ఒకటి.

స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగానయినా చెరువునీటి వనరుల సంరక్షణ గురించి చంద్రబాబు ప్రభుత్వం ఏమైనా చెబుతుందేమోనని చూసినవారికి 'విజన్' నిరాశే కలిగిస్తుంది. కోట్లు పెట్టుబడి దిగుమతి చేసుకొనిసాధించే కార్పొరేట్ అభివృద్ధి మీదే 'విజన్' దృష్టి అంతా.

> స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగానయినా చెరువునీటి వనరులసంరక్షణ గురించిచంద్రబాబు ప్రభుత్వం ఏమైనా చెబుతుందేమోనని చూసినవారికి 'విజన్' నిరాశే కలిగిస్తుంది. కోట్లు పెట్టుబడి దిగుమతి చేసుకొని సాధించే కార్పొరేట్ అభివృద్ధి మీదే 'విజన్' దృష్టి అంతా.

చెరువుల తర్వాత బావుల కింద వ్యవసాయం తెలంగాణాకూ రాయలసీమకూ అతి ముఖ్యం. ఇందులో ప్రభుత్వం చేసేది ఏమీ లేదు– కరెంటు సరఫరా చేయడంతప్ప. ఇప్పటిదాకా కరెంటు సబ్సిడీ ఉండబట్టి బావులకింద వ్యవసాయం ఈ రెండు ప్రాంతాలలోనూ బాగానే విస్తరించింది. గ్రామీణ జీవితం రూపురేఖలను కొంత మేరకిది మార్చగలిగింది. కానీ ఇది ఎక్కువ రోజులు నిలిచేటట్టు లేదని 'విజన్' వైఖరి చూసినా, విద్యుత్ బోర్డు పునర్వ్యవస్థీకరణ చూసినా తెలుస్తుంది. అభివృద్ధికి అవసరమైన రోడ్లు, రైల్వేలైన్లు, ఓడరేవులు, కరెంటు మొదలయిన నిర్మాణపరమైన వ్యవస్థలను పెంపొందించడం మాత్రమే ప్రభుత్వం బాధ్యత అనీ దాని కోసం పెద్దఎత్తున పెట్టుబడులు ఆహ్వానించాలనీ 'విజన్' దృక్పథం ఎంతగా చెబుతుందో, ఈ నిర్మాణాలకయ్యే ఖర్చు, నిర్వహణ వ్యయం, వాడకందారుల ముక్కుపిండి వసూలు చేయాలని కూడా అంతేగట్టిగా చెబుతుంది. విద్యుచ్ఛక్తి రైతులందరికీ శాశ్వతంగా ప్రభుత్వం చవగ్గా సరఫరా చేయాలని నేననడంలేదు. అందరికీ చేయనక్కరలేదు గానీ సాగునీటి విషయంలో తీవ్రమైన లేమి అనుభవిస్తున్న ప్రాంతాలలోని సామాన్య రైతాంగానికి ఇవ్వడం అవసరం, సమంజసం కూడా. దీనికికూడా తావులేకుండా చేసే 'విజన్' వైఖరి తెలంగాణా, రాయలసీమలకు చాలా అన్యాయం చేస్తుంది. ఈ ప్రాంతాల అభివృద్ధిని 20 ఏళ్ళు వెనక్కి తీసుకుపోతుంది. వీరికి సబ్సిడీ ఇవ్వడం కోసం అభివృద్ధి చెందిన ప్రాంతాల రైతులనుంచి (ఇక్కడి భూస్వాములనుంచి కూడా) పూర్తి కరెంటు చార్జి వసూలుచేసినా అభ్యంతరం చెప్పనవసరంలేదు. (కాల్డారి రైతాంగపోరాటం పేరిట గోదావరి డెల్టా రైతులకు సైతం కరెంటు సబ్సిడీ కొనసాగించాలని వాదించిన వారికి ఇది నచ్చకపోవచ్చుగాక. ఆ వైఖరి మొత్తంగానే సబ్సిడీలు ఎత్తివేతకు మార్గం సుగమం చేస్తుంది.)

నిజానికి సాగునీటి విషయంలో దేశంలో అతికొద్ది రాష్ట్రాలకున్న సంపద మన రాష్ట్రానికి ఉంది. సాగునీటి వనరులను సక్రమంగా, సమదృష్టితో వాడుకుంటే ప్రతీ ఒక్క ఎకరం సాగుభూమికీ ఒక పంటకు సాగునీరు అందించవచ్చునని మన రాష్ట్రం గురించి అంచనా. కానీ ఇన్నేళ్ళ అభివృద్ధి ఇచ్చిందేమిటంటే కొన్ని ప్రాంతాలకు రెండు, మూడు పంటలకు నీళ్ళు, కొన్ని ప్రాంతాలకు వర్షంనీళ్ళు. చెరువుల నిర్వహణ పట్ల ఇప్పటికే ఏ మాత్రం పట్టింపు చూపించని ప్రభుత్వ భవిష్యదర్శిని వైఖరి, బావినీళ్ళ వాడకానికి అత్యవసరమై కరెంటు సబ్సిడీ పట్ల ఆ దర్శిని ప్రదర్శించే వ్యతిరేక వైఖరి ఈ అసమానతను తీవ్రంగా పెంచుతాయే తప్ప తగ్గించవు.

పోనీ నదీజలాల వాడకం విషయంలో ఏమైనా సమదృష్టి పెరిగిందని 'విజన్' చూపిస్తుందా? ఇప్పటికి ఈ విషయంలో జరిగిన అన్యాయం గురించి కొత్తగా చెప్పనవసరంలేదు. గోదావరిలో కావలసినన్ని నీళ్ళుండీ మన పాలకులు దానిని సాగునీటికోసం వాడడంలో పెద్దగా ఆసక్తిచూపలేదు. దీనివల్ల ఉత్తర తెలంగాణా జిల్లాలు తీవ్రంగా నష్టపోయాయి. కృష్ణానదిలో అవసరం కంటే బాగా తక్కువ ఉన్న నీటివాడకం విషయంలోనూ మన రాష్ట్రంలో చాలా అన్యాయం జరిగింది. వర్షపాతం సాపేక్షంగా సమృద్ధిగా ఉన్న ప్రాంతాలకే కృష్ణానది నీళ్ళు మొదట లభించాయి. సరే, అది బ్రిటిష్ హయాంలోననుకుందాం. కానీ తెలుగువాళ్ళందరి కోసం విశాలాంధ్ర నినాదంతో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత కృష్ణానదిపైన నిర్మించిన మొదటి ప్రాజెక్టు కూడా ప్రధానంగా ఆ ప్రాంతానికే మళ్ళీ నీళ్ళించ్చింది. రాయలసీమ, దక్షిణ తెలంగాణా ప్రాంతాలు (కృష్ణా నది మీద ఆధారపడక తప్పని ప్రాంతాలు) నీళ్ళడిగేసరికి ఆ నదిలో మిగులుజలాలే తప్ప నికర జలాలు లేవన్నారు.

నదీజలాల ప్రాజెక్టులలో ఇప్పటికే కేంద్రం అనుమతి పొందిన వాటి జాబితా, అనుమతి కోసం ప్రయత్నం చేస్తున్నవాటి జాబితా 'విజన్ 2020' లో ఇచ్చారు.రాయలసీమ వాసులు గొంతెండిపోయేలాగా ఆందోళన చేస్తున్న హంద్రీ–నీవా, గాలేరు–నగరి ప్రాజెక్టులు ఈ రెండు జాబితాలలోను లేవు! ఎందుకని అడిగితే అవి మిగులు జలాల ప్రాజెక్టులని జవాబు చెబుతారేమో. కానీ కృష్ణాడెల్టా స్థిరీకరణ కోసం ఉద్దేశించిన పులిచింతల కూడా మిగులు జలాల ప్రాజెక్టే. దానిని మిగులు జలాల ప్రాజెక్టుగాకాక, కృష్ణా డెల్టాను ఆధునీకరించడం వల్ల మిగిలే ఎనిమిది టిఎంసిల నికర జలాలు ఉపయోగించుకునే ప్రాజెక్టుగా చూపించి ఇప్పటికే కేంద్రం అనుమతి కూడా సంపాదించేశారు.

ఈ అబద్ధం ఒకవేళ నిజమే అయితే–అంటే ఆ ఎనిమిది టిఎంసిలనీరు కృష్ణా డెల్టాను ఆధునీకరించడం వల్ల మిగిలే నికర జలాలే అయితే – ఆ నీటిని ఇప్పటికే కృష్ణాజలాలు అత్యధికంగా వాడుకుంటున్న కృష్ణా, గుంటూరు జిల్లాల ఆయకట్టు స్థిరీకరణ అనే లగ్జరీ కోసం వాడకుండా నదిపై భాగాన శ్రీశైలం దగ్గరే ఆ ఎసి నల్లగొండకు నీరిచ్చే శ్రీశైలం ఎడమకాలువ ప్రాజెక్టులో పారించవచ్చుగదా? ఆ రకంగా శ్రీశైలం ఎడమ కాలువకు కొంతయినా నికరజలం అందించవచ్చుకదా? మిగులు జలాన్ని నికర జలంగా చూపించి అబద్ధం చెప్పి పులిచింతలకు ఆమోదం తేగల వాళ్ళు మరో అబద్ధం చెప్పి (హంద్రీ అనే నదిలో చాలా నీళ్ళున్నాయనీ గాలేరు అనేది జీవనది అనీ చెప్పి) హంద్రీ–నీవాకూ, గాలేరు–నగరికీ కేంద్రం అనుమతి తీసుకురావచ్చు కదా!

ఇవేవీ చేయబోవడంలేదనీ నదీ జలాల వాడకం విషయంలో 'స్వర్ణాంధ్రప్రదేశ్'లో కొత్త ఏమీ లేదనీ 'విజన్ 2020' చెబుతుంది. అయినప్పటికీ అది స్వర్ణాంధ్రప్రదేశ్ ఎలా అవుతుందో చంద్రబాబు నాయుడుకే తెలియాలి.

మరి సాగునీటి విషయంలో కొత్త ఏమీలేకపోగా ఇప్పటిదాకా బావులకూ, బోర్లకూ అందిచిన కరెంటు సబ్సిడీ సైతం తీసేయబోయేటట్టయితే తెలంగాణా రాయలసీమల వ్యవసాయ అభివృద్ధి గురించి 'విజన్ 2020' ఏం చెబుతుంది?

ఏమీ చెప్పకుండా పోలేదు. కానీ ఏం చెబుతుందో చదివిన తర్వాత ఏమీ చెప్పకుండా ఆ ప్రాంతాల రైతులను వారి పాటికి వారిని వదలేస్తేనే బాగుండేదేమోనన్న సందేహం రాకమానదు. మెట్ట భూములను మాగాణిగా మార్చే పథకమేదీ లేని 'విజన్', మెట్టభూములలోకే పెట్టుబడి భారీగా ఆకర్షించే మార్గాన్ని మాత్రం అన్వేషిస్తుంది. తెలంగాణా మొక్కజొన్న సాగకు అనువైన ప్రాంతమనీ, రాయలసీమ పళ్ళతోటలకు అనువైన ప్రాంతమనీ, రెండు ప్రాంతాలూ పశుపోషణకు అనువైన పచ్చిక బయళ్ళు విస్తారంగా కలిగి ఉన్నాయనీ 'విజన్' గుర్తించింది. మొక్కజొన్న కోళ్ళదాణాగా కోళ్ళ ఫారాలకు ఉపయోగపడుతుందనీ, పళ్ళతోటలున్న చోట ఫ్రూట్‌జ్యూస్ పరిశ్రమ బాగా అభివృద్ధి చెందగలదనీ, పచ్చికబీళ్ళున్న చోట పాలఉత్పత్తుల పరిశ్రమ వర్ధిల్లగలదనీ కూడా 'విజన్' గుర్తించింది. కాబట్టి ఆ మూడు పరిశ్రమలకూ ముడిసరుకు సరఫరాచేసే రంగాలుగా తెలంగాణా, రాయలసీమల వ్యవసాయ క్షేత్రాలను 'విజన్' అర్థం చేసుకుంటుంది.

దీనివల్ల 'అభివృద్ధి' రానే రాదని అనలేం. గ్రామీణ ప్రాంతాల స్థలాల ఆదాయం పెరుగుదల రేటు కొంతకాలం మెరుగుపడవచ్చు. (ఆపైన కోళ్ళ పరిశ్రమ, ఫ్రూట్ జ్యూస్ పరిశ్రమ, పాల ఉత్పత్తుల పరిశ్రమ, దేశీయ విదేశీయ మార్కెట్‌లో ఎదుర్కొనే ప్రతీ సంక్షోభానికీ ఈ అభివృద్ధి కూడా గురికాగలదు). కానీ ఈ అభివృద్ధికీ స్థిరత్వంలేకపోవడమే కాదు, విస్తృతి ఉండదు. ఆయా రంగాలలో పెట్టుబడి పెట్టే కంపెనీలతో రైతాంగం అమ్మకం–కొనుగోలు సంబంధాలు పెట్టుకొని వారి కనుసన్నలలో బతకాలి. పెట్టుబడి రుణాలు ప్రభుత్వ బ్యాంకులో పరపతి సంఘాలూ ఇకమీదట ఎక్కువగా ఇవ్వవు కాబట్టి రైతాంగం తీర్చలేకపోతే తమ భూములు వారికే లీజుకిచ్చుకొని కూలి చేసుకొని బతకాలి.

మెట్టసాగును పెట్టుబడితో ముడిపెట్టే జూఎ ఈ విజన్ 2020 'అభివృద్ధి పథం' తెలంగాణా రాయలసీమల గ్రామీణ జీవితాల కొక వికృత రూపం ఇస్తుంది. కొద్దిమంది విపరీతంగా ప్రయోజనం పొందగలరు. కానీ వారంతా స్థానికులే కానవసరంలేదు. కొంతమంది కొంత పొందుతూ కొంత పోగొట్టుకుంటూ అస్థిరంగా కొట్టుమిట్టాడుతూ బతుకుతారు. మెజారిటీకి మాత్రం ఈ వ్యూహం ఏమీ ఇవ్వదు. కనీసం కూలి చేసుకునే అవకాశం కూడా కల్పించదు. మొక్కజొన్న చేలు, పళ్ళ తోటలు, పచ్చికబీళ్ళు ఎంతమందికి ఎన్ని దినాల పని కల్పిస్తాయి?